సాక్షి
గుంటూరు

గురువారం । 13 । మార్చి । 2025



వైభవంగా శతచండీ మహాయాగం

నత్తెనపల్లి: పట్టణంలోని త్రిశక్తి దుర్గాపీఠంలో శతాధిక ప్రతిష్ఠా బ్రహ్మ శ్రీశ్రీశ్రీ హనుమత్ స్వామి ఆధ్వర్యంలో శత చండీ మహాయాగం బుధవారం వైభవంగా నిర్వహించారు.



'బార్' ఎన్నికలకు ఏడు నామినేషన్‌లు

గుంటూరు లీగల్: గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి బుధవారం ఏడుగురు అభ్యర్థులు వివిధ పోస్టులకు నామినేషన్ దాఖలు చేశారు.



రేపు కోటప్పకొండ గిరి ప్రదక్షిణ

నరసరావుపేట రూరల్: ఈనెల 14న ఉదయం 5గంటలకు త్రికోటేశ్వర స్వామి గిరిప్రదక్షిణ ప్రారంభమవుతుందని గిరి ప్రదక్షిణ సేవా సమితి అధ్యక్షుడు అనుమోలు వెంకయ్యచౌదరి తెలిపారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురు)	సహర్ (శుక్ర)
గుంటూరు	6.23	5.01
నరసరావుపేట	6.25	5.03
బాపట్ల	6.23	5.01



మోగింది యువభేరి : యువత పోరులో కూటమి సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న యువకులు



వైఎస్సార్ సీపీ అండగా : యువత పోరు ప్రదర్శన అగ్రభాగాన వైఎస్సార్ సీపీ నేతలు

న్యూస్‌రీల్

గుత్తికొండ బిలంలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు

పిడుగురాళ్ల: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన గుత్తికొండ బిలాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి టి.సుజాత బుధవారం సందర్శించారు. గుత్తికొండ బిలంలోని పుణ్యక్షేత్రంలో ఆమె ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హైకోర్టులో గుమస్తాగా పనిచేస్తూ ఇటీవల మృతిచెందిన మండలంలోని జూలకల్లు గ్రామానికి చెందిన సంధ్యానాయక్ కుటుంబ సభ్యులను వారి స్వగృహంలో పరామర్శించారు. ఆమె వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలించిన ఆర్డీఓ



అచ్చంపేట: మండలంలోని మాదిపాడులో ప్రభుత్వ భూములను ఆర్డీఓ జి.రమాకాంత్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. మాదిపాడు నుంచి పులిచింతల ప్రాజెక్టు వరకు నిర్మాణంలో ఉన్న రోడ్డుకు అంతరాయం కలుగచేస్తున్న వారి భూములను పరిశీలించి, రోడ్డు నిర్మాణానికి ఎలాంటి ఆటంకం కలిగించవద్దని సూచించారు. అనంతరం కృష్ణానదిపై మంజూరైన వంతెన నిర్మాణానికి కావలసిన అనుమతులు, భూసేకరణ తదితర వివరాలను కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సుమారు 20 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములుండగా వాటిని ఏవిధంగా వినియోగించుకోవాలనే విషయంపై తహసీల్దార్‌తో చర్చించారు. వారి వెంట వీఆర్వోలు, గ్రామ సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

యార్డులో 1,40,254 మిర్చి బస్తాలు విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,39,436 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,40,254 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాలకు సగటున ధర రూ.10,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చి రూ.5,000 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 68,733 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

కబ్జాపై కదిలిన యంత్రాంగం

అక్రమాలకు పాల్పడిన అధికారులకు నోటీసులు

సాక్షి ఎఫెక్ట్

గురజాల రూరల్: గురజాల జగనన్న కాలనీలో మొత్తం 70 సెంట్ల స్థలాన్ని కూటమి నేతలు కబ్జా చేసిన వైనంపై రా'జాగా' కబ్జా అనే శీర్షికతో బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అక్రమాలకు పాల్పడిన పలువురు అధికారులకు ఉన్నతాధికారులు నోటీసులు జారీ చేశారు. పలువురికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ వి.మురళీకృష్ణ మాట్లాడుతూ గతంలో రీ సర్వే సరిగ్గా చేయని ఇద్దరు సర్వేయర్లకు, జగనన్న కాలనీలో అక్రమ రిజిస్ట్రేషన్లకు సహకరించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వీఆర్వోకు షోకాజ్ నోటీసులు అందించామన్నారు. ఈ విషయంలో ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. సర్వే చేయించి పూర్తిగా విచారణ జరిపిస్తామన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు విచారణలో తేలితే రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తామన్నారు.

యువత మార్చ్‌ఫాస్ట్

- కదంతొక్కిన విద్యార్థులు, యువకులు
- తరలివచ్చిన వేలాది మంది
- హామీలు నెరవేర్చకుంటే ఉద్యమం ఉద్ధృతం చేస్తామని హెచ్చరిక
- ఆమరణ నిరాహార దీక్షలకూ సిద్ధమని ప్రతిన
- భారీ ప్రదర్శనతో కూటమి నేతల వెన్నులో వణుకు

సూర్యుడు భగభగలకు దీటుగా యువతరం నిప్పులుచెరిగింది. పదంపదం కలిపి కదంతొక్కింది. కాలకూటమి తొమ్మిది నెలల నయవంచక పాలనపై నిరసన గళమెత్తింది. ఫీజులివ్వని బాబు వ్యూహాలు మాడిపోయేలా విద్యార్థిలోకం రగిలింది. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగభృతి అంటూ తియ్యని హామీలతో గొంతుకోసిన దొంగ ప్రభుత్వంపై సింహనాదమై యువతరం గర్జించింది. జనకంటక ప్రభుత్వానికి ఇది ప్రళయ సంకేతమని ధ్వజమెత్తింది. అబద్ధాల పునాదులపై నిలబెట్టిన కూటమి సర్కారును కూల దోస్తామని హెచ్చరించింది. రేపటి తరాల సంక్షేమం కాంక్షించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెన్నంటే ఇక నడుస్తామని ప్రతినబూనింది.



హెచ్చరికతో కూడిన విన్నపం : డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న అంబటి రాంబాబు, లేళ్ల అప్పిరెడ్డి షేక్ నూరిఫాతిమా, మోదుగుల వేణుగోపాలరెడ్డి, పానుగంటి చైతన్య, బలసాని కిరణ్‌కుమార్, దొంతిరెడ్డి వేమారెడ్డి, వజ్రబాబు, అంబటి మురళీకృష్ణ తదితరులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు, నగరంపాలెం: వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు బుధవారం గుంటూరు నగరంలో చేపట్టిన 'యువత పోరు'కు యువత, విద్యార్థులు, నిరుద్యోగులు భారీగా తరలివచ్చారు. తొలుత స్వామి థియేటర్ సెంటర్‌లోని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు, నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా, గుంటూరు, పల్నాడు పార్లమెంటరీ జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్తలు అంబటి మురళీకృష్ణ (పొన్నూరు), బాలవజ్రబాబు(తాడికొండ), దొంతిరెడ్డి వేమారెడ్డి(మంగళగిరి), బలసాని కిరణ్‌కుమార్ (ప్రత్తిపాడు) స్టూడెంట్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తరలివచ్చిన యువతతో కలిసి జూట్‌మిల్, కంకరగుంట రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు.

అడుగడుగునా అడ్డంకులు

యువత పోరు ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసులు యత్నించారు. ర్యాలీ ప్రారంభంలో ద్విచక్రవాహనాల తాళాలు లాక్కుని పట్టాభిపురం సీఐ వీరేంద్ర హడావుడి చేశారు. కలెక్టరేట్ మీదుగా ర్యాలీలో కలిసేందుకు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ నాయకులు నూనె ఉమామహేశ్వరరెడ్డి వెళ్తుండగా కంకరగుట్ట ఫ్లైఓవర్ వద్ద అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ యువకులపై దాడి చేశారు. దీంతో తోపులాట జరిగింది. ట్రాఫిక్ కానిస్టేబుల్ టోపీ పడిపోయింది. దీన్ని కానిస్టేబుల్‌పై దాడి అంటూ ఎల్లోమీడియా దుష్ప్రచారానికి పూనుకుంది. మరో వైపు కలెక్టరేట్‌కు సమీపంలో రెండంచెల్లో బారికేడ్లు పెట్టి ర్యాలీని కలెక్టరేట్ వరకూ వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సమయంలో పోలీసులు, యువతకు మధ్య తోపులాట జరిగింది. యువత బారికేడ్లను దాటుకుని కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నినదించారు. అనంతరం డీఆర్వోకు వైఎస్సార్ సీపీ నేతలు వినతిపత్రం అందించారు.

స్పందించకుంటే ఉద్యమం ఉద్ధృతం

అనంతరం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడిచినా ఏ ఒక్క హామీనీ చంద్రబాబు అమలుచేయలేదని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు కలిపి సుమారు రూ.4,600 కోట్లు పెండింగ్ ఉన్నాయని అంబటి వివరించారు. బకాయిలు ఇవ్వక పోగా కేవలం రూ.2 వేల కోట్ల బకాయిలు మాత్రమే ఉన్నట్టు బడ్జెట్‌లో చూపించారని మండిపడ్డారు. నిరుద్యోగ భృతి ద్వారా రూ.3 వేలు ఇస్తానని, ఇరవై లక్షల ఉద్యోగాలు కల్పిస్తానని హామీ ఇచ్చిన బాబు వాటి ఊసే ఎత్తడం లేదని ధ్వజమెత్తారు.

గత ప్రభుత్వంలో విద్య, వైద్యానికి పెద్దపీట

గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేశారని అంబటి గుర్తుచేశారు. జిల్లాకు ఒక వైద్య కళాశాలను వైఎస్ జగన్ మంజూరు చేయగా, కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటుపరం చేసేందుకు కుట్రలు చేస్తోందని అంబటి మండిపడ్డారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయకపోతే ఉద్యమం మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

కేసులకు భయపడం

వైఎస్సార్ సీపీలో చురుగ్గా ఉన్న వారిపై పోలీసుల వేధింపులు ఎక్కువయ్యాయని, కేసులకు భయపడే పార్టీ వైఎస్సార్ సీపీ కాదని అంబటి స్పష్టం చేశారు. ప్రముఖ సినీ రచయిత పోసాని కృష్ణమురళీపై 17 కేసులు నమోదు చేయడాన్ని తప్పుబట్టారు. ప్రతిపక్షంపై కేసులు పెట్టించేందుకు విద్యాశాఖ మంత్రి లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని అంబటి ధ్వజమెత్తారు. ఆయన తన శాఖపై దృష్టిపెట్టి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయించాలని డిమాండ్ చేశారు. యువత పోరును అడ్డుకునేలా పోలీసులు వ్యవహరించారని మండిపడ్డారు. నిరసన గళమెత్తిన విద్యార్థులపైనా కేసులు పెట్టాలని చూస్తున్నారని, రెడ్‌బుక్‌కు తన ఇంట్లో కుక్క కూడా భయపడదని అంబటి ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయని బాబుపైనా 420 కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, స్టూడెంట్ విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్, పార్టీ నాయకులు నూనె ఉమామహేశ్వరరెడ్డి, మండేపూడి పురుషోత్తం, షేక్.మస్తాన్‌వలి, మాదిరెడ్డి శ్రీనివాస రెడ్డి, మెట్టు వెంకటప్పరెడ్డి, బైరెడ్డి రవీంద్రారెడ్డి, బత్తుల దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక అవస్థలు

వైఎస్సార్ సీపీ స్టూడెంట్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఆవేదన చెందారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలే రూ.3,900 కోట్లు ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి రూ.3 వేలు తక్షణం ఇవ్వాలని, వసతి దీవెన అమలు చేయాలని, లేకుంటే రానున్న రోజుల్లో ఆమరణ నిరాహార దీక్షలు చేపడతామని, ప్రాణత్యాగాలకైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

తిరుగుబాటు మొదలైంది

గుంటూరు, పల్నాడు జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల కడుపు మంటతో విప్లవం మొదలైందని అన్నారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు భృతి హామీ అమలు చేయాలని పేర్కొన్నారు. లేకుంటే రాస్తారోకోలు, ఆమరణ నిరాహార దీక్షలు నిర్వహిస్తామని చెప్పారు.

- వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు షేక్.నూరిఫాతిమా మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఎంతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు సర్కారు యత్నిస్తోందని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఏపీ అంతటా 17 వైద్య కళాశాలలను ఏర్పాటుచేయగా అందులో ఐదు కళాశాలలను ప్రారంభించారని పేర్కొన్నారు. వీటిని ప్రైవేటుపరం చేసేందుకు కూటమి కుట్రలు పన్నుతోందని ధ్వజమెత్తారు.

సంక్షేమ జెండాదే నైతిక విజయం

- పేదల కోసం ఆవిర్భవించిన పార్టీ వైఎస్సార్ సీపీ
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
- వైభవంగా పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవం
- పార్టీ శ్రేణుల్లో వెల్లువెత్తిన నవోత్సాహం
- పార్టీ జెండాల ఆవిష్కరణతో ప్రజాపోరాటాలకు పునరంకితం



పార్టీ జిల్లా కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న అంబటి రాంబాబు, చిత్రంలో మోదుగుల, కావటి, నూరిఫాతిమా, అంబటి మురళీ కృష్ణ తదితరులు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): పేద ప్రజల పక్షాన నిలబడేందుకు, వారి కన్నీటిని తుడిచేందుకు 14 ఏళ్ల క్రితం వైఎస్సార్ సీపీని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించారని ఆ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బృందావన్ గార్డెన్స్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో గుంటూరు, పల్నాడు పార్లమెంటరీ జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, గుంటూరు నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా, పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, ఇతర ముఖ్య నేతలతో కలిసి పార్టీ జెండాను అంబటి ఆవిష్కరించారు.

- అంబటి రాంబాబు మాట్లాడుతూ అసత్యాలతో అధికారంలోకి వచ్చిన అధికార కూటమిపై వైఎస్సార్ సీపీ సంక్షేమ జెండాదే నైతిక విజయమని పేర్కొన్నారు. పార్టీ ప్రస్తుతం బలంగా ఉందని, శ్రేణులు ఉత్సాహంగా ప్రజా పోరాటాలకు పునరంకితమవుతున్నారని పేర్కొన్నారు. ఇదే ఉత్సాహంతో వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు కంకణబద్ధులమవుదామని పిలుపు ఇచ్చారు.



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

- మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేదవాడూ గర్వపడేలా వైఎస్సార్ సీపీ పుట్టిందన్నారు. ఈ పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యార్థులను అవస్థలకు గురిచేస్తోందన్నారు. మెడికల్ కాలేజీ సీట్ల విషయంలో గందరగోళం సృష్టిస్తోందని మండిపడ్డారు. రానున్న కాలంలో పార్టీ శ్రేణులంతా మరింత కష్టపడి ఏకతాటిపై నిలబడి పార్టీ గెలుపు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.
- నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అబద్ధాలతో అధికారం చేపట్టి పేదల సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేసిందని విమర్శించారు.
- వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీ కృష్ణ మాట్లాడుతూ ప్రజలకు వైఎస్సార్ సీపీ అండగా నిలబడుతోందని, ప్రజల పక్షాన పోరాడుతోందని చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ వజ్రబాబు, పార్టీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కల్ప వృక్ష వాహనంపై నృసింహుడు

- పొన్న శేష వాహనంపై చిన్నికృష్ణుడిగా గోపికలతో..

మంగళగిరి టౌన్ /మంగళగిరి : మంగళాద్రిలో వేంచేసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. బుధవారం ఉదయం కల్పవృక్ష వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించి తరించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఈవో రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. కైంకర్య పరులుగా గొంటుముక్కల రమణయ్య, సుగుణ దంపతులు వ్యవహరించారు. రాత్రి పొన్న శేష వాహన ఉత్సవం జరిగింది. పొన్న శేష వాహన సేవ కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం వ్యవహరించింది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, అన్నమాచార్య కీర్తనల ఆలాపన భక్తులను ఆధ్యాత్మికోత్సాహంలో ఓలలాడించాయి.



పొన్న శేష వాహనంపై గోపికల మధ్య చిన్నకృష్ణుడిగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు

నేడు స్వామి దివ్య కల్యాణ మహోత్సవం

ప్రధాన ఘట్టమైన స్వామి దివ్య కల్యాణ మహోత్సవం గురువారం అర్ధరాత్రి నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రామకోటిరెడ్డి తెలిపారు. గురువారం ఉదయం స్వామి అశ్వ వాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిస్తారని వివరించారు. రాత్రి ఎదురుకోలు ఉత్సవాన్ని కోలాహలంగా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. అనంతరం దివ్య కల్యాణోత్సవం జరుగుతుందని వివరించారు.

సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తుల స్వీకరణ

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): జిల్లాలో 2024-25 సంవత్సరానికి పలు కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు అందించేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీ భవానీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీ, కమ్మ, కాపు, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా ఈ రుణాలు అందుతాయని వివరించారు. వివిధ రంగాల్లో స్థిరపడాలనుకునే నిరుద్యోగ అభ్యర్థులు https://apobmms.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

జీఎస్టీ, కస్టమ్స్ అప్పీల్స్ అడిషనల్ కమిషనర్ బదిలీ

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరులోని జీఎస్టీ, కస్టమ్స్ అప్పీల్స్ కార్యాలయంలో అడిషనల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న నూతలపాటి సౌమ్య రాష్ట్ర సర్వీస్‌కు డెప్యూటేషన్‌పై బదిలీ అయ్యారు. ఈ మేరకు రింగురోడ్డు లోని అప్పీల్స్ కార్యాలయంలో బుధవారం ఆమె విధుల నుంచి రిలీవ్ అయ్యారు. గురువారం ఆమె విజయవాడలో రాష్ట్ర జీఎస్టీ అడిషనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. సౌమ్య 2011 సివిల్ సర్వీసెస్‌కు చెందిన ఐఆర్ఎస్ అధికారిణి. ఢిల్లీలోని కేంద్ర ఆర్థిక శాఖ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఆమె సెంట్రల్ ట్యాక్స్ నుంచి స్టేట్ ట్యాక్స్‌కు మారనుండడం విశేషం. ఆమె డెప్యూటేషన్ గడువు మూడేళ్ల మాత్రమే.

అగ్నివీర్ దరఖాస్తుకు ఏప్రిల్ 10 వరకు గడువు

గుంటూరు ఎడ్యుకేషన్: భారత సైన్యంలో అగ్నివీర్ ద్వారా వివిధ పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలకు చెందిన అభ్యర్థుల కోసం దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించినట్లు గుంటూరులోని ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయ డైరెక్టర్ కల్నల్ పునీత్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విభాగాలవారీగా www.joinindianarmy.nic.in ద్వారా ఏప్రిల్ 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక అభ్యర్థి రెండు వేర్వేరు విభాగాల్లో దరఖాస్తు చేసుకోవచ్చునని వివరించారు. ఆన్‌లైన్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సీఈఈ) తొలిసారిగా తెలుగుతో సహా 13 వేర్వేరు భాషల్లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 1.6 కిలోమీటర్ల పరుగు సమయాన్ని ఆరు నిముషాల 15 సెకన్లకు పెంచినట్లు వివరించారు. గుంటూరు, కర్నూలు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అనంతపురం, వైఎస్సార్ కడప, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన ఆసక్తిగల అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. నియామక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఉంటుందని స్పష్టం చేశారు.

పసుపు ధరలు

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డులో బుధవారం 206 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. కొమ్ములు 123 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.8,000. గరిష్ట ధర రూ.10,300. మోడల్ ధర రూ.9,125. కాయలు 83 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ట ధర రూ.8,000. గరిష్ట ధర రూ.10,325 మోడల్ ధర రూ.10,100, మొత్తం 154.500 క్వింటాళ్ల అమ్మకాలు జరిగాయి.

శ్రీవారి కల్యాణానికి పకడ్బందీ ఏర్పాట్లు

- టీటీడీ, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశం



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి చిత్రంలో టీటీడీ ఈఓ జె.శ్యామలారావు, ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ భార్గవ్‌తేజ్



ఇతర అధికారులు

తాడికొండ: వెంకటపాలెం శ్రీవారి ఆలయ ప్రాంగణంలో ఈనెల 15న జరుగనున్న శ్రీనివాస కల్యాణానికి సంబంధించిన అన్ని పనులను సకాలంలో పూర్తి చేయాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. వెంకటపాలెంలోని ఆలయ ప్రాంగణంలో బుధవారం టీటీడీ అధికారులు, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మితో కలిసి ఆయన గుంటూరు జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. శ్యామలరావు మాట్లాడుతూ శ్రీనివాస కల్యాణంపై సమీప గ్రామాల్లో టీటీడీ ప్రచారం రథం ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా కల్యాణ వేదిక పరిసరాల్లో అవసరమైన గ్యాలరీలు, క్యూలైన్‌లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శ్రీవారి ఆలయం, కల్యాణ వేదిక పరిసరాల్లో భక్తులను ఆకట్టుకునేలా విద్యుత్ అలంకరణలు చేపట్టాలన్నారు. భక్తులు సులభతరంగా స్వామిని దర్శించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం తలెత్తకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కల్యాణానికి భజన బృందాలు, శ్రీవారి సేవకులను పెద్ద ఎత్తున ఆహ్వానించాలని ఆదేశించారు. జిల్లా, టీటీడీ అధికారుల కోసం ప్రత్యేకంగా జాయింట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టి సీసీ కెమెరాలతో నిరంతరం భద్రతను పర్యవేక్షించాలని ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సులువుగా వచ్చేందుకు వీలుగా తగినన్ని ఆర్టీసీ బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్వామి కల్యాణాన్ని నేరుగా చూడలేని లక్షలాది మంది భక్తుల సౌలభ్యం కోసం ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయాలని ఆదేశించారు. వేదిక పరిసరాలలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు .అత్యవసర సమయంలో తక్షణం స్పందించేలా విపత్తు నిర్వహణ బృందాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. భక్తులకు అవసరమైన వైద్య సదుపాయాలు, మందులు, సిబ్బంది, అంబులెన్సులు అందుబాటులో ఉంచాలన్నారు. భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ పంపిణీ చేసేందుకు అవసరమైన శ్రీవారి సేవకులను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. సాయంత్రం 4 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి తగు ఏర్పాట్లు చేయాల్సిందిగా హెచ్ డీపీపీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం ఆయన అధికారులతో కలసి కల్యాణ వేదిక, తదితర పరిసరాల్లో జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈఓ సి.హెచ్.వెంకయ్య చౌదరి, జేఈఓ వీరబ్రహ్మం, గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పర్యవేక్షణకు మంత్రుల బృందం

సాక్షి, అమరావతి: శ్రీనివాస కల్యాణం ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు మంత్రుల బృందం ఏర్పాటైంది. సీఎం చంద్రబాబు ఆ కార్యక్రమానికి హాజరు కానున్న నేపథ్యంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డితోపాటు అనగాని సత్యప్రసాద్, వి.అనిత, పి.నారాయణ, కందుల దుర్గేష్‌తో కూడిన బృందం ఏర్పాట్ల పర్యవేక్షణకు గురువారం ఆలయాన్ని సందర్శిస్తారని, టీటీడీ ఈఓ కూడా అందుబాటులో ఉండాలని సూచిస్తూ దేవదాయ శాఖ కార్యదర్శి వి.వినయ్ చంద్ బుధవారం మెమో జారీ చేశారు.

అద్భుతం.. అజరామరం



శ్రీసీతారాముల కల్యాణం జరిపిస్తున్న పండితులు

తెనాలి: స్థానిక కొత్తపేటలోని తాలూకా హైస్కూల్ గ్రౌండ్ వేదికగా జరుగుతున్న అష్టోత్తర శతకోటి శ్రీరామనామ పారాయణ మహాయజ్ఞ పూర్ణాహుతి మహోత్సవాలు విశేషంగా కొనసాగుతున్నాయి. ఈనెల 14 వరకు నిర్వహించే ఆధ్యాత్మిక వేడుకల్లో భాగంగా బుధవారం శ్రీ సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. సీతారాముల కల్యాణం విశిష్టతను బ్రహ్మశ్రీ ములుకుట్ల విశ్వనాథశర్మ తన ప్రవచనంలో వివరించారు. శ్రీరామనామ మహిమను భక్తులకు తెలియజేశారు. వైఖానస ఆగమ పండితులు నారాయణం గోవర్ధన్ లక్ష్మీ రఘురాం, వేదాంతం నాగమారుతి, రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, ఆర్‌వీ కిరణ్, సురేష్ బృందం వైదిక క్రతువును నిర్వహించింది. సాయంత్రం గాయని, 'పాడుతా తీయగా' మహాసంగ్రామం విజేత సాయి వేదవాగ్దేవి చేసిన భక్తి గీతాలాపన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమాలకు ములుకుట్ల విశ్వనాథ శర్మ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. భగవద్ రామానుజ దాసుడు జంధ్యం రామారావు దంపతులు కార్యక్రమాల నిర్వహణకు భక్తిపూర్వక సహకారం అందించారు. భక్తులకు ప్రసాద వితరణ, అన్నప్రసాద వితరణ జరిపారు. శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన బృందం, సంకీర్తన సేవాసమితి, శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్ సభ్యులు మూర్తి అనురాధ, వెంకటేశ్వరరావు ,గుడివాడ బాలకృష్ణ , మదుపల్లి చంద్రశేఖర్, మాజేటి వెంకటేష్, గోలి సోమశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉద్యోగులు సమర్థంగా పనిచేయాలి

కలెక్టర్ నాగలక్ష్మి



క్యూ ఆర్ కోడ్‌తో కూడిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, అధికారులు

గుంటూరు వెస్ట్: ఉద్యోగులు మరింత సమర్థంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. బుధవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ నిర్వహించిన వీడియో సమావేశం అనంతరం కలెక్టర్ స్థానిక కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖల ఉద్యోగుల పనితీరుపై ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాల మేరకు చర్యలు ఉంటాయని వివరించారు. అన్ని శాఖల్లో రాష్ట్ర స్థాయి కార్యాలయం జారీ చేసిన ఫార్మెట్లను సిద్ధం చేయాలన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యా శాఖ, సంక్షేమ శాఖ, వైద్య, ఆరోగ్య శాఖ, ఆసుపత్రులు తదితర శాఖలు నిర్దేశించిన కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలన్నారు. సచివాలయాల పరిధిలో జరుగుతున్న ప్రజలు, దాతలు, ప్రభుత్వం భాగస్వామ్యం (పీ-4) సర్వే వేగవంతం చేసి సత్వరమే పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. అనంతరం పీ-4 కార్యక్రమాలపై ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరించడానికి క్యూ ఆర్ కోడ్‌తో రూపొందించిన ప్రచార పోస్టర్‌లను జిల్లా కలెక్టర్, జీఎంసీ కమిషనర్ పులిశ్రీనివాసులు, డీఆర్వో షేక్ ఖాజావలి, జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, జిల్లా అధికారులు ఆవిష్కరించారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

- హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం
- విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాన్ని సందర్శించాలి
- సందేహాల నివృత్తికి ప్రత్యేక కంట్రోల్ రూం నంబర్లు
- జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రేణుక, పక్కన పార్వతి

గుంటూరు ఎడ్యుకేషన్ : ఈనెల 17 నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక చెప్పారు. కలెక్టరేట్ వద్ద ఉన్న డీఈవో కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 470 పాఠశాలల నుంచి 29,459 మంది రెగ్యులర్ విద్యార్థులతో గతంలో తప్పిన, ప్రైవేటుగా రాస్తున్న మరో 961 మందిని కలుపుకుని మొత్తం 30,410 మంది విద్యార్థుల కోసం 150 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో జరగనున్న దూరవిద్య టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న 1,133 మంది అభ్యర్థుల కోసం టెన్త్ రెగ్యులర్ పరీక్ష కేంద్రాల్లోనే 21 కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరగనుండగా, విద్యార్థులు గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలకు వెళ్లి, వచ్చేందుకు వీలుగా హాల్ టిక్కెట్ చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే సదుపాయాన్ని కల్పించినట్లు చెప్పారు. పేపర్ లీకేజీకి ఆస్కారం లేని విధంగా ప్రభుత్వం పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేసిందని చెప్పారు. విద్యార్థులకు బార్ కోడింగ్ నంబరు కలిగిన ఓఎంఆర్ షీట్‌తోపాటు ప్రశ్నపత్రంపై ప్రత్యేక సీరియల్ నంబరు ఉంటుందని చెప్పారు. పరీక్షలకు సంబంధించిన సమాచారం, ఫిర్యాదుల కోసం డీఈవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశామని, 99513 97109, 90523 43447 నంబర్లకు విద్యార్థులు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని వివరించారు. టెన్త్ పరీక్షల జిల్లా పరిశీలకురాలు పి.పార్వతి మాట్లాడుతూ అన్ని పరీక్ష కేంద్రాల వెలుపల హాల్ టికెట్‌పై ఉన్న సెంటర్ కోడ్‌తో పరీక్ష కేంద్రం పేరును స్పష్టంగా తెలిసే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని పాఠశాలల యాజమాన్యాలను ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కె. వెంకట్‌రెడ్డి, డీసీఈబీ కార్యదర్శి ఏ. తిరుమలేష్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం పాల్గొన్నారు.

సీడ్ యాక్సిస్ రోడ్డుపై పచ్చదనం పెంచాలి

అమరావతి అభివృద్ధి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీపార్థసారథి



అధికారులతో మాట్లాడుతున్న లక్ష్మీ పార్థసారథి

తాడికొండ: అమరావతి రాజధానికి వెళ్లే సీడ్ యాక్సిస్ రోడ్డుపై పచ్చదనం పెంచాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) చైర్ పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీ పార్థసారథి అధికారులను ఆదేశించారు. సీడ్ యాక్సిస్ రోడ్డును బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా నాటిన మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పలు సూచనలు చేశారు. అనంతరం ఎన్-9 రోడ్డుపై బఫర్ జోన్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రచించాలని ఉద్యాన అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఆమె వెంట ఏడీసీ జనరల్ మేనేజర్ కె శ్రీ హరిరావు, చీఫ్ ఇంజినీర్ ఎం ప్రభాకరరావు, ఉద్యాన విభాగాధిపతి వివిఎస్ ధర్మజ పాల్గొన్నారు.

ఎన్జీరంగా వర్సిటీని సందర్శించిన అమెరికా ప్రొఫెసర్



ప్రొఫెసర్ ఎంఎస్ రెడ్డిని సన్మానిస్తున్న వీసీ డాక్టర్ ఆర్ శారదజయలక్ష్మిదేవి తదితరులు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాం ఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని అమెరికా వ్యవసాయ విద్యాలయం ప్రొఫెసర్ ఆచార్య ఎంఎస్ రెడ్డి బుధవారం సందర్శించారు. విశ్వవిద్యాలయంలోని శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, అధికారులు, విద్యార్థులతో ముఖాముఖీ చర్చల్లో పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మిదేవి మాట్లాడుతూ మన భవిష్యత్తును కాపాడుకునేందుకు మొక్కలు, నేలల ఆరోగ్యం కాపాడుకోవటంలో ప్రపంచ వ్యాప్తంగా ఉద్భవిస్తున్న సమస్యలను, ఎలా అధిగమించాలి అనే అంశాలపై ఆయనతో చర్చించారు. విదేశాల్లో చేసిన వ్యవసాయ పరిశోధనలు, వాటి వల్ల కలిగే ఉపయోగాలను ప్రొఫెసర్ ఎంఎస్ రెడ్డి వివరించారు. వ్యవసాయ విద్యార్థులకు వ్యవసాయం, వాటి మెలకువలను వివరించారు. అనంతనం విశ్వవిద్యాలయం అధికారులు ఎంఎస్ రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిమిషంలో గుండె గుట్టు విప్పేస్తాడు

- 14 ఏళ్లకే గుండె పరీక్షలు చేస్తున్న ఎన్ఆర్ఐ బుడతడు
- ఏఐ ద్వారా ప్రత్యేక యాప్‌కు రూపకల్పన
- గుంటూరు జీజీహెచ్‌లో పరీక్షలు చేసి అబ్బురపరుస్తున్న సిద్ధార్థ



సిద్ధార్థను అభినందిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ



అమెరికాలో తల్లిదండ్రులతో సిద్ధార్థ

గుంటూరు మెడికల్: నిమిషంలో గుండె పనితీరు ఎలా ఉందో గుర్తించి లోగుట్టు విప్పేస్తున్నాడు 14ఏళ్ల ఈ ఎన్ఆర్ఐ బుడతడు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అందరినీ అబ్బురపరుస్తున్నాడు. గుంటూరు జీజీహెచ్‌కు ప్రత్యేక ప్రాజెక్టులో భాగంగా అమెరికా నుంచి వచ్చిన ఈ చిన్నోడు రోగులను పరీక్షిస్తున్నాడు. అమెరికాలో స్థిరపడిన ఏపీలోని అనంతపురానికి చెందిన నంద్యాల మహేష్, శ్రీలత దంపతుల తనయుడు సిద్ధార్థ 14 ఏళ్లకే కృత్రిమ మేధస్సుతో అమెరికా డల్లాస్‌లోని టెక్సాస్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ అభ్యసిస్తున్నాడు. గుండె పనితీరును తెలుసుకునేందుకు ప్రత్యేకంగా యాప్‌ను కనిపెట్టాడు. అమెరికా మాజీ అధ్యక్షులు ఒబామా, బైడెన్, పలువురి గవర్నర్ల నుంచి అవార్డులు, సన్మానాలు అందుకున్నాడు. అమెరికాలో ప్రయోగాత్మకంగా యాప్ పనితీరు నిరూపించి భారత దేశంలోనూ పేద రోగులకు గుండె పరీక్షలు చేసేందుకు ముందుకు వచ్చాడు. కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సహాయంతో అమెరికాలో ఉంటున్న సిద్ధార్థ తల్లిదండ్రులు అతడిని మంగళవారం గుంటూరు జీజీహెచ్‌కు పంపించారు. వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు గుంటూరు జీజీహెచ్‌లో పేద రోగులకు పరీక్షలు చేసేందుకు సిద్ధార్థకు అనుమతిచ్చారు. బుధవారం ఉదయం అతను సుమారు 150 మందికి గుండె పరీక్షలు చేశాడు. సెల్ ఫోన్‌ను ఛాతి దగ్గర నిమిషం పాటు ఉంచితే క్షణాల్లోనే ప్రత్యేక యాప్ ద్వారా ఈసీజీ నివేదిక ప్రత్యక్షమవుతోంది. సిద్ధార్థ తాను పరీక్షించిన వారిలో ఇద్దరికి గుండె పనితీరు సరిగా లేదని గుర్తించాడు. వారిని తక్షణమే వైద్యులు గుండె జబ్బుల వార్డుకు రిఫర్ చేశారు. పరీక్షల తీరును పర్యవేక్షించిన జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ సిద్ధార్థను అభినందించారు.

సంబంధం లేని వ్యక్తులపై ట్రాఫిక్ కానిస్టేబుల్ ఫిర్యాదు

కేసు నమోదు చేసిన నగరంపాలెం పోలీసులు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): వైఎస్సార్ సీపీ తలపెట్టిన యువత పోరు కార్యక్రమంలో తనపై దాడి చేశారంటూ సంబంధం లేని వ్యక్తులపై ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బుధవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. అసలేం జరిగిందంటే.. యువత పోరు కార్యక్రమంలో భాగంగా భారీగా తరలివచ్చిన యువత కంకరగుంట ఫ్లైఓవర్ బ్రిడ్జిపై బైక్ ర్యాలీగా వస్తున్న సమయంలో వెస్ట్ ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ సుభానిబాబు అత్యుత్సాహం చూపించారు. యువకులను అడ్డుకునే యత్నం చేశారు. అయినా యువకులు ముందుకు కదిలారు. అయితే ఆ సమయంలో వైఎస్సార్ సీపీ నాయకుడు నూనె ఉమామహేశ్వరరెడ్డి, మరికొందరు తనపై దాడి చేశారంటూ హెడ్ కానిస్టేబుల్ సుభాని నగరంపాలెం పోలీసు స్టేషన్‌లో బుధవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. వాస్తవానికి హెడ్‌కానిస్టేబుల్ యువకులను అడ్డుకున్న సమయంలో ఉమామహేశ్వరరెడ్డి అక్కడ లేరు. అయినా అతనిపై, అతని అనుచరులపై ఫిర్యాదు చేయడం, పోలీసులు కేసు నమోదు చేయడం విస్మయం కలిగించింది.

పత్తి మిల్లు సీజ్..

లోపల చిక్కుకున్న ఇద్దరు బిహార్ కూలీలు



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): రుణం చెల్లించలేదని ఓ బ్యాంక్ నిర్వాహకులు పత్తి మిల్లుకు తాళాలు వేశారు. అయితే అందులో చిక్కుకున్న ఇద్దరు కూలీలను బయటకు తీసుకువచ్చే ప్రయత్నాలను లాలాపేట పోలీసులు చేశారు. ఏటుకూర్ రోడ్‌లోని ఓ పత్తిమిల్లు నిర్వాహకులు గతంలో కొత్తపేటలోని ఓ బ్యాంక్ నుంచి రుణం తీసుకున్నారు. అయితే మిల్లు నిర్వాహకులు సకాలంలో రుణం చెల్లించకపోవడంతో బ్యాంక్ అధికారులు బుధవారం మధ్యాహ్నం మిల్లుకు తాళాలు వేసి సీజ్ చేశారు. మిల్లు లోపల బిహార్ రాష్ట్రానికి చెందిన కూలీలు దినేష్, ఉమేష్ ఉండిపోయారు. ఈ విషయమై లాలాపేట పోలీసుల దృష్టికి తోటి కూలీలు తీసుకెళ్లారు. దీంతో పోలీసులు బ్యాంకు అధికారులతో సంప్రదింపులు జరిపి కూలీలను బయటకు తీసుకొచ్చారు.

సిమెంట్ లారీని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు



బస్సులో ఇరుక్కుపోయిన డ్రైవర్ శేఖర్

జె.పంగులూరు: వేగంగా ప్రయాణిస్తూ నిద్ర మత్తులోకి జారుకొని ఎదురుగా వెళుతున్న సిమెంట్ లారీని ఢీకొన్న ప్రమాదంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం తెల్లవారుజామున మండలంలోని రేణింగవరం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై జరిగింది. రేణింగవరం ఎస్ఐ వినోద్‌బాబు తెలిపిన వివరాలు ప్రకారం.. విశాపట్నం నుంచి తిరుపతికి వెళుతున్న ఆర్టీసీ బస్సు బుధవారం తెల్లవారుజామున రేణింగవరం సమీపంలోకి వచ్చింది. ఆదే సమయంలో డ్రైవర్ కె. శేఖర్ నిద్రమత్తులోకి జారుకుని ఎదురుగా వెళుతున్న సిమెంట్ లారీని ఢీకొట్టాడు. వెంటనే తేరుకొని ఎడమవైపు బస్సును తిప్పడంతో పొలాల్లోకి వెళ్లింది. బస్సు ముందువైపు భాగంగా బాగా దెబ్బతింది. బస్సు డ్రైవర్ శేఖర్ కాళ్లకు బాగా గాయాలయ్యాయి. సీటు వద్ద ఇరుక్కుపోయాడు. హైవే సిబ్బంది వచ్చి అతడిని బయటకు తీశారు. డ్రైవర్‌ది చిత్తూరు జిలా నెమలికుంట గ్రామం. ప్రమాద సమయంలో ఆ బస్సులో 40 మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారని, వారిని ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని ఎస్ఐ వినోద్‌బాబు తెలిపారు. డ్రైవర్ శేఖర్‌ను అద్దంకి ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సుఖ జీవనానికి నూతన ఆవిష్కరణలు దోహదం

నగరం: శాస్త్ర సాంకేతిక రంగాల్లో నూతన అవిష్కరణలు మానవాళి సుఖ జీవనానికి దోహదపడుతున్నాయని అచార్య నాగార్జున విశ్వవిదాలయం ప్రొఫెసర్ డాక్టర్ పీవీ కృష్ణ చెప్పారు. స్థానిక ఎస్వీఆర్‌ఎం కళాశాలలో బుధవారం 'జీవ శాస్త్రంలో నూతన పోకడలు' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని తెలిపారు.నేడు అన్ని రంగాల్లో పరిశోధనలు విజయవంతం కావడంతో విప్లవాత్మకమైన మార్పులు సంభవిస్తున్నాయని వివరించారు. ఆక్వా రంగంలో నూతన పోకడలతో రొయ్యలు, చేపలు పెంపకంలో దిగుబడులు పెరిగాయని, ఎగుమతులు కూడా అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. సమావేశంలో ఏఎన్‌యూ బయోటెక్నాలజీ, నానో టెక్నాలజీ ప్రొఫెసర్లు డాక్టర్ కె. కస్తూర్, డాక్టర్ గిరిధర్‌లు నూతన అవిష్కరణలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చియ్య చౌదరి, ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ, అకడమిక్ డైరెక్టర్ వి. వెంకటస్తశ్వరావు, బోటనీ హెచ్‌వోడీ పి. వెంకట నారాయణ, జువాలజీ హెచ్‌వోడీ కె.సురేష్ బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీవారి తిరు కల్యాణం.. రమణీయం



రేపల్లె రూరల్: పట్టణంలోని ఉప్పూడి రోడ్డులో గల శ్రీలక్ష్మీ గోదా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా లక్ష్మీ, గోదా సమేత వేంకటేశ్వరులకు మంగళస్నానాలు చేయించి, వధూవరులుగా అలంకరించారు. అనంతరం వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడమ కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తిరు కల్యాణ వేడుకలను తిలకించి, స్వామికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు. రాత్రి శ్రీలక్ష్మి, గోదా, వెంకటేశ్వరుడి విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు.